
# తెలుగు వీరుడు

ఎస్. మోహనహరి



"కౌసల్యా సుప్రజా రామా పూర్వా సంధ్యా ప్రవర్తతే..."

టేప్ రికార్డర్‌లో నుంచి సుప్రభాతం వినిపిస్తోంది. నా అర్ధాంగి చాలీచాలని స్థలంలో ముగ్గులు వేస్తోంది.

పొద్దున్న లేవగానే ధ్వని కాలుష్యాన్ని భరించలేను. చిరాకు పుడుతోంది.

ఆ మాటే నా ముద్దుల శ్రీమతితో చెబితే మూతిని మూడు వంకర్లు తిప్పుతూ "మీది మరీ చోద్యమండీ! సుప్రభాతం విన్నవారికి బుద్ధి వికసిస్తుంది. అజ్ఞానం హరించి జ్ఞానోదయం కల్గుతుంది'' అంటుంది.

అందుకనే పళ్ళు తోముకుంటూ టెర్రస్ మీదికెళ్ళిపోయాను.

నిశ్శబ్దం అంతర్లీనమైన చల్లటి గాలి సుతారంగా మొహం మీద ముద్దాడుతోంది.

"వాతావరణం ప్రశాంతంగా ఉందేమిటబ్బా! మా ఈ అయిదంస్తుల అపార్ట్‌మెంట్లో మా తెలుగు వీరులు ఇంకా యుద్ధానికి సంసిద్ధము కాలేదేమిటబ్బా!!''

నలువైపులా తొంగి చూశాను.

అబ్బే, లాభం లేదు.

దాదాపు నలభై ఆరు ఫ్లాట్లలో ఇరవై ఏడుమంది తెలుగు వీరులు నివశిస్తున్నారు. మిగతా వాళ్ళు అరవవాళ్ళు. వాళ్ళు అరుచుకుంటారు. కానీ మరుసటి రోజు కాకపోతే వారం రోజుల్లో మళ్ళీ కలుసుకుంటారు. మరి, మన తెలుగు వీరులు అట్లాంటి మంచి పని చేస్తారా? అలా చేస్తే తెలుగువాళ్ళకి నామోషి కదా! ఏదో ఒక నెపంతో కసి తీర్చుకోవటం మన తెలుగువాళ్ళ రక్తంలో తరతరాల నుంచీ ఉందాయె.

అందుకే కనుల పండగయ్యే దృశ్యమింకా మొదలవలేదు. నాలాంటి పిరికి తెలుగువాళ్ళు మరో ముగ్గురు అపార్ట్‌మెంట్ కిటికీల నుంచి తొంగి చూస్తున్నారు.

అప్పుడు వినిపించింది, తెలుగు వీరుడు గోపాలరావు గొంతు!!

"ఏంటయ్యా! నాగరాజు కాస్త కిందికి దిగి వస్తావా?''

నాగరాజు కిందికి దిగివస్తూ "అబ్బబ్బ ఏమిటయ్యా?! నీ గోల. అప్పిచ్చినవాడిలా ఏమిటా కేకలు?'' అన్నాడు.

అదే అదే అతను చేసిన పొరపాటు.

నేను దేనికోసమైతే ఎదురు చూస్తున్నానో ఆ యుద్ధ సమయం ఆసన్నమైంది.

"ఏంటి? నేను మెల్లిగా పిలిస్తే నీకు గోలలా ఉందా? నా మాటలు కేకలా?? ఔన్లే. నీలాంటి వాడికి అంతకంటే మరింకెలా వినిపిస్తుంది'' అన్నాడు గోపాలరావు.

"ఇదిగో, మర్యాదగా మాట్లాడు. ఇంతకీ నన్నెందుకు పిల్చావ్?''

"అయ్యా! మహాప్రభో! మీరు

మహానుభావులు. పెద్దలు. మీ ఇంట్లోని చెత్తంతా నా నెత్తిమీద పడుతోంది. రెండు వారాల నుంచీ మర్యాదగా చెబుతున్నా. మనిషికొక మాట, గొడ్డుకొక దెబ్బ. పిల్లలుగలవాణ్ణి. మా కష్టాలు మీకేమర్థమవుతాయి?"

"అంటే ఏమిటి నీ అభిప్రాయం? మేము పిల్లలు లేని గొడ్డుమోతు వాళ్ళమనే కదా నీ దెప్పి పొడుపు. చూడూ! నీ ఇంటి ముందు చేత్త వేస్తున్నది మేము ఒకళ్ళమే కాదు. అందరూ వేస్తున్నారు. మేమూ వేస్తున్నాము. దానికి ఇంత ఎగిరెగిరి పడుతున్నావ్ తేరగా మెత్తటివాడ్ని నా దగ్గరనా నీ ప్రతాపం?"

"నాగరాజా! నాలో సహనం నశించిపోతోంది. ఇంటి ముందు చెత్త గుట్టలు గుట్టలుగా పోస్తుంటే దోమలెక్కవైపోతున్నాయ్. పిల్లలు మలేరియా జ్వరంతో మంచం పడుతున్నారు."

వాళ్ళిద్దరి మాటలు విని ఆ ప్రక్క నుంచీ ఈ ప్రక్క నుంచీ జగన్నాథం, విష్ణుమూర్తితో బాటు మరో నలుగురు గుమిగూడారు.

అందరూ గోపాల్రావుని సమర్థిస్తున్నారు.

"సర్లేండి! మీరందరూ కట్ట కట్టుకుని నా మీద ఎగబడుతుంటే నేనేం చెప్పనూ? పోనీ డబ్బులిస్తాను. మీలో ఎవరైనా ఆ పన్చేసి తీసుకోండి" అనేశాడు నాగరాజు.

అతని మాటలు విని జగన్నాథం ఛాతి విరుచుకున్నాడు.

"అదిగో అదే! ఆ మాటే నాకు నచ్చదు. డబ్బుంది కదా అని ఇతరులని అవమానించడం మంచిది కాదు.మేమేమైనా కూలి ముండా కొడుకుల్లా కనిపిస్తున్నామా? ఏంటీ నీ ఉద్దేశ్యం??" అన్నాడు.

"మీరంతా పెడర్థాలు తీస్తే నేనేం మాట్లాడలేను. చెత్త తీయించే బాధ్యత నా ఒక్కడిదే కాదు. మనందరిదీ. ఎక్కువ మాట్లాడితే పోలీసులను పిలవాల్సొస్తుంది" నాగరాజుకి కోపం వచ్చేసింది.

"పోలీసులను పిలుస్తావా? నాయనా! అప్పటి దాకా మేము ఊరుకుంటామనుకుంటున్నావా? ఏ కీలుకి ఆ కీలు విరగ్గొట్టి మూల పడేస్తాం. జాగ్రత్త" అన్నాడు విష్ణుమూర్తి.

"ఛీఛీ! బుద్ధి గడ్డితిని అపార్ట్‌మెంట్లో ఫ్లాట్ కొనుక్కున్నాను. మనిషి అన్నవాడికి ఓపిక ఉండాలి" నాగరాజు చీదరించుకున్నాడు.

నాకెంతో హాయిగా ఉంది. "తెలుగు వీరుడా! లేవరా, లుంగీ ఎత్తి ముందుకి దూకరా" అని కూని రాగం తీస్తూ తమాషా చూస్తున్నాను.

"ఓపికా? బాగుందయ్యా. రెండు వారాల నుంచి చెబుతున్నాను. చేతులు జోడించి మొరపెట్టుకున్నాం. ఊహు...మీ శాంతి వచనాలు నీ చెవులకి ఎక్కితే కదా. ఆదివారం ఆబగా తలుపేసుకుని పెళ్ళాంతో సరసాలాడక ఈ కాస్త పని చేయిస్తే పోయేదిగా" అన్నాడు గోపాల్రావు.

నాగరాజు మొహం మాడ్చుకుని "ఓహో! అదా నీ ఏడుపు. వీడు ఎప్పుడు ఇంట్లోంచి బయటకు రాడు. ఎవ్వరితో మాట్లాడడు. తలొంచుకొని వెళ్తాడు. వస్తాడు. అని మీ అందరికి నా మీద ఏడుపు. ఇప్పుడర్థమైంది" అన్నాడు.

"అదిగదిగో ఆ మాటే మాట్లాడవద్దంటున్నా. పిల్లలు గలవాళ్ళం. నీలాగ లింగూ లిటుకులంకాము. టింగురంగా అంటూ భార్యని వెనకేసుకుని సినిమాలకి, షికార్లకి ఎక్కడ కుదుర్తుంది...నెవ్వెట్లా పోతే మాకేం గానీ కనీసం డబ్బులు పారేయ్. కూలి వాళ్ళని తెప్పించి ఎత్తివేయిస్తాను" అన్నాడు జగన్నాథం.

"అహా! నెలకి రెండున్నర వందలు మెయిన్‌టెన్ చార్జీలు కడుతున్నాను. ఆ డబ్బులు ఏం చేస్తున్నారు? ఆ పనేదో నేనే చేయిస్తాను. నీకాశ్రమ ఎందుకులే?"

"అంటే నీ డబ్బుల మీద మాకాశా? ఔను మరి. లంచం లేనిదే ఫైలు కదలనివ్వవని నీ సంగతెవరికి తెలీదూ?"

"జగన్నాథం! నువ్వు శృతి మించి మాట్లాడుతున్నావ్. ఇక్కడ ఆఫీసు విషయాలు ఎత్తితే వూర్కునేది లేదు. జాగ్రత్త."

"ఏమన్నావ్? మళ్ళీ చెప్పు. నా సంగతింకా తెలీదు నీకు" గోపాల్రావు రుసరుసలాడుతూ నాగరాజు ఛాతీ మీద చెయ్యేసి తోస్తుంటే నాగభాస్కర్ పరుగెత్తుకొచ్చాడు.

"ఏయ్! గోపాల్రావు మీ దాదాగిరి పాపం అమాయకుడి ముందు చూపించడమెందుకు? రా! దమ్ముంటే అదేదో నాతో తేల్చుకో" అన్నాడు భుజాలు ఎగరేస్తూ.

గోపాల్రావుకి అరికాలి మంటనెత్తికెక్కింది.

"అబ్బో! అయ్యగారు అంతా అయిపోయాక వచ్చారా? ఇంతసేపూ ఎక్కడున్నావు స్వామీ!...ఇదిగో భాస్కర్! నువ్వు మా మధ్యలో జోక్యం చేసుకుంటే బాగుండదు మరి."

"అదేరా నేనంటున్నది. ఒక్కణ్ణి చేసి దాదాగిరి చూపిస్తున్నారు."

"ఓయబ్బో పెద్ద నీతిపరుడొచ్చాడండీ బాబూ! చూడూ, నీ సంగతి మాకు తెలియదనుకోకు. నాగరాజు దగ్గర అడపాదడపా అప్పు తీసుకుంటావని అతన్ని వెనకేసుకుని వస్తున్నావని అందరికీ తెలుసు."

తగాదా పెరిగిపోతుంటే నా మనసు సంబరపడిపోతోంది. గంతులేస్తోంది.

నాగభాస్కర్, గోపాల్రావు ఒకరినొకరు కలియపడ్డారు. తోసుకుంటున్నారు. బండ బూతులు తిట్టుకుంటున్నారు.


"తెలుగువీరుల్లారా? షెహభాష్!!" అనుకున్నాను.

అప్పుడే ఒకడు ఇటుకరాయిని అందుకున్నాడు.

మరొకడు ఇంట్లోకెళ్ళి రోకలి పట్టుకొచ్చాడు.

వాళ్ళిద్దరిని విడిపించాలని మిగతావాళ్ళు ప్రయత్నిస్తున్నారు.

నాగరాజు మౌనంగా ఒక మూలకెళ్ళి నిల్చున్నాడు.






చాలా "వింత" గొలిపే విషయం?

"ఆరడుగుల మనిషి", అరంగుళం "సూదిపోటు"కు "అబ్బా" అని అరవడం!

* * *

కాపురం "పచ్చ"గా సాగాలంటే..?

ఎప్పుడూ "జేబు" పచ్చనోట్లతో కళకళలాడుతూ వుండాలి!

* * *

మనిషికి కోపం, విసుగూ ఒకేసారి ఎప్పుడు వస్తాయి?

"లెట్రిన్" ఎంగేజ్డ్ అయినప్పుడు!

* * *

విజయవాడలో "బ్యాంక్"లన్నీ ఎపుడు ఉలిక్కి పడతాయి?

"మరో మనిషి"కి "యూరో లాటరీ" తగిలిందని తెల్సినప్పుడు!

* * *

"పబ్లిసిటీ" ఎందుకు?

"సరుకు"లో "సత్తా" లేనందుకు!

* * *

కరెంటు చార్జీల "ఉద్యమం"?

"తాటాకుల మంట!"

* * *

నేటి లోకంలో "ధర్మపరులు" ఎలా వున్నట్లు?

నాడు "నూటికొక్కడు" - నేడు "కోటి కొక్కడు!"

* * *

గొప్ప "స్టంట్ చిత్రం" పేరు ఎలా వుంటుంది?

"నిలబడితే కలబడతా!"

* * *

నేటి "టెలీ సీరియల్స్"...?

కథ "అరంగుళం" కథనం "అరమైలు!"

* * *

"దసరా" ఎందుకు?

"మామూళ్ళు" అడుక్కోడానికి!

నా కడుపు నిండిపోయింది. ఎగిరి గంతులేశాను.

గోలగోలగా అయిపోయింది.

అరవసోదరులు మౌనంగా మాటలు వింటున్నారు. వాళ్ళ చేష్టలను గమనిస్తున్నారు. లోలోపల ఏహ్యభావం మిళితమైన నవ్వులు నవ్వుకుంటున్నారు.

"పొద్దున్నే ఏమిటీ న్యూసెన్స్? మీకేమీ పనీపాటలేనట్లుంది? ఛీఛీ. ఆదివారం వస్తే చాలు అపార్ట్‌మెంట్ అదిరిపోతోంది. బయటవాళ్ళు చూస్తే ఈ అపార్ట్‌మెంట్ వాళ్ళంతా ఇలాంటి వాళ్ళేనని అనుకుంటారు. సిగ్గులేకపోతే సరి. వెళ్ళండి. జరిగింది చాలు" పెద్ద మనిషి కాశీ విశ్వనాథశర్మ మందలించారు.

గోపాల్రావుకి మంచి సందు దొరికింది.

ఛఛ. ఆదివారం బయటకు రావడమే తప్పు అంటూ యుద్ధభూమి నుంచీ పారిపోతున్న సైనికుడిలా గబగబా లోపలికి వెళ్ళిపోయాడు.

నాగరాజు కూడా నెమ్మదిగా ఇంట్లోకి వెళ్ళిపోయాడు.

తగాదా అయిపోయింది.

నా కళ్ళకి తృప్తి కల్గలేదు. నిరాశతో ఇంట్లోకి వచ్చేశాను.

"మాంచి తమాషా జరిగింది చూశావా?" అన్నాను శ్రీమతితో.

"ఆఁ ఇదేం కొత్తా? ప్రతి ఆదివారం జరిగే భాగవతమేగా..." అంది.

"ఓసి పిచ్చిదానా! ఇలాంటి దృశ్యాలు మళ్ళీ మళ్ళీ కనిపించవు. చూడాలి, ఇంకా చూడాలి. తెలుగు వీరుడంటే ఏమిటో ఆదివారమే తెలుస్తుంది" శ్రీమతి బుగ్గమీద చిటికేశాను.

"ఇంకా నయం...దేవుడు మిమ్మల్ని ఆడదానిగా పుట్టించలా! లేకుంటే రోజుకో తగాదా తెచ్చి పెట్టేవారు. బ్రతికిపోయాను" అంటూ శ్రీమతి నిట్టూర్పు విడుస్తుంటే భళ్ళున నవ్వాను.

"ఆదివారమంటే అందరూ సరదాగా నవ్వుకుంటూ కలిసిమెలిసి ఉండేరోజు. కష్టాలను పంచుకునే రోజు. ఆదివారమంటే అదరగొట్టే రోజు కాదు. అందరూ ఆనందించే రోజు."

శ్రీమతి లెక్చర్ మొదలు పెడితే గంటలు క్షణాలైపోతాయి. ఎంతయినా తెలుగువీరుని ధర్మపత్ని కదా!

బాత్‌రూమ్‌లోకి వెళ్ళబోతుంటే మరో తెలుగు వీరుడు హరిజీవన్ గొంతు వినిపించింది. "ఏమయ్యా, మోహన్! ఓసారి కిందికి వస్తావా?" అంటూ.

బిత్తరపోయాను.

గాలి నావైపు తిరిగింది!!!

ఊహించని పరిస్థితి. మిడిగుడ్లేసుకుని శ్రీమతివైపు చూశాను.

శ్రీమతి పెదవుల మీద చిర్నవ్వు అలవోకగా కనిపిస్తోంది.

ఆదివారం! క్రింది పోర్షన్ వాడు పిలుస్తున్నాడు!!

శ్రీమతివైపు ప్రాధేయపూర్వకంగా చూశాను.

"ఆయన లేరన్నయ్యా! బజారుకెళ్ళారు" అని శ్రీమతి అంటుంటే చటుక్కున బాత్‌రూమ్‌లోకి దూరిపోయాను. "తెలుగు వీర లేవరా! గమ్మున బాత్‌రూమ్‌లోకెళ్ళరా..." అనుకుంటూ.